క్లుప్తంగా

నకిరేకల్ కమిషనర్‌గా ప్రవీణ్‌కుమార్

నకిరేకల్: నకిరేకల్ మున్సిపల్ గ్రేడ్–3 కమిషనర్‌గా కే.ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీ కమిషనర్ల బదిలీల్లో భాగంగా హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో పనిచేస్తున్న కే.ప్రవీణ్‌కుమార్ పదోన్నతిపై నకిరేకల్ కమిషన్‌గా బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసిన మున్సిపల్ కమిషన్ బాలయ్య గత ఏప్రిల్ 31న పదవీ విరమణ పొందారు. అప్పటినుంచి మున్సిపల్ మేనేజర్‌గా ఉన్న అబ్దుల్ రశీద్ ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

చిట్యాల మున్సిపల్ కమిషనర్‌గా దండు శ్రీను



చిట్యాల: చిట్యాల మున్సిపల్‌కమిషనర్‌గా దండు శ్రీనును నియమిస్తూ మంగళవారం రాష్ట్ర మున్సిపల్ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దండు శ్రీను నందికొండ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తూ చిట్యాల మున్సిపాలిటీకి ఇన్‌చార్జ్ కమిషనర్‌గా నెలన్నర రోజులుగా విధులు నిర్వహించారు. కాగా మంగళవారం జరిగిన బదిలీల్లో ఆయనను చిట్యాల మున్సిపల్ రెగ్యులర్ కమిషనర్‌గా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

నీలగిరి అసిస్టెంట్ కమిషనర్‌గా రవీందర్

నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్‌గా కొండారెడ్డి రవీందర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతిపై అసిస్టెంట్ కమిషనర్‌గా వచ్చిన రవీందర్ మంగళవారం నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతిపై వెళ్లిన నాగరాజు

నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న చెనబోయిన నాగరాజుకు ఇటీవల మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతులు లభించిన విషయం తెలిసిందే. పదోన్నతి పొందిన తర్వాత కూడా శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా నెలకు పైగా నీలగిరి మున్సిపాలిటీలో విధులు నిర్వర్తించారు. కాగా మున్సిపల్ కమిషనర్ల బదిలీల్లో భాగంగా నాగరాజును నారాయణపేట జిల్లా పెబ్బేరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన మంగళవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నకిరేకల్ : పట్టణంలో ఏరియా ఆస్పత్రి సమీపంలో కొత్తగా ఏబీ స్విచ్ అమర్చడం కోసం బుధవారం ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు నకిరేకల్ పట్టణ వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ధర్మతేజ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమ్మె నోటీసు అందజేత

నల్లగొండ టౌన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ కోరారు. మంగళవారం దేశవ్యాప్త సమ్మె నోటీసును జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్యకు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పోలె సత్యనారాయణ, ప్రేమలత, బి రేణుక, సి.శోభ, ఆకారం శోభ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

మర్రిగూడ : అర్హులైన పేదలు జాతీయ కుటుంబ ప్రయోజన ఫండ్(ఎన్ఎఫ్‌బీఎఫ్)కు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయస్సు మధ్యలో కుటుంబ పెద్ద మరణించి ఉండి కుటుంబాన్ని పోషించే మహిళకు రూ.20 వేలు మంజూరవుతాయని తెలిపారు. ఏప్రిల్ 12, 2017 తరువాత మరణించిన వారు ఆపద్బంధు పథకం పొందని వారు మాత్రమే ఈ పథకానికి అర్హులని తెలిపారు. బ్యాంక్ అకౌంట్, డెత్ సర్టిఫికెట్ జిరాక్స్ పత్రాలతో తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నార్కట్‌పల్లి : శాపల్లి గ్రామానికి చెందిన కూరాకుల రామలింగయ్యకు చెందిన పాడిగేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. వివరాలు.. మంగళవారం ఉదయం వ్యవసాయ పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ సమీపాన గాలికి విద్యుత్ తీగ తెగి సమీపంలో మేత మేస్తున్న పాడిగేదెపై పడడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు రామలింగయ్య తెలిపారు.

అధిక ఫీజులను నియంత్రించాలి

మునుగోడు: మండలంలోని పలు ప్రైవేటు విద్యా సంస్థలు నిబంధనలు పాటించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, తనిఖీలు చేసి అధిక ఫీజులను నియంత్రించాలని కోరుతూ మంగళవారం డీవైఎఫ్ఐ నాయకులు మునుగోడు ఎంఈఓ టి.మల్లేశంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి, మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి నరేష్, రవి, చింటు, చరణ్, శివ, అరుణ్ పాల్గొన్నారు.

శిథిల భవనంలోనే చదువులు

- ఊడిపడుతున్న పైకప్పు పెచ్చులు
- భయాందోళనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు
- 'మనఊరు–మనబడి' కింద నూతన భవనానికి రూ.57.5 లక్షలు మంజూరు
- నిధుల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం
- అసంపూర్తిగా పాఠశాల భవనం



శిథిలావస్థలో ఉన్న చెరువుఅన్నారం పాఠశాల భవనం

కట్టంగూర్ : మండలంలోని చెరువుఅన్నారం గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు సరిపోను తరగతి గదులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మన ఊరు–మనబడి కార్యక్రమం కింద పాఠశాలలో ఐదు తరగతి గదులు నిర్మించేందుకు రూ.57.5 లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో కాంట్రాక్టర్ 6 నెలల్లో భవనం పూర్తి చేస్తానని చెప్పి ఉపయోగంలో ఉన్న కొన్ని తరగతి గదులను కూల్చివేశాడు. అదే స్థలంలో నూతన భవనం పనులు ప్రారంభించి స్లాబ్, గోడల వరకు పూర్తి చేశాడు. అయితే బిల్లు రాకపోవడంతో కాంట్రాక్టర్ భవన నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపివేశాడు. నూతన భవనానికి హస్తరుకారు, విద్యుత్ పనులు, ఫర్నీచర్ ఏర్పాటు చేస్తే సరిపోతుంది. ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు నిధులు విడుదల చేయకపోవడంతో అసంపూర్తిగా ఉన్న భవనం 14 నెలలుగా ఉత్సవ విగ్రహంలా దర్శనమిస్తోంది.

భయంభయంగా చదువులు

చెరువుఅన్నారం ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 68 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరడంతో రెండు సంవత్సరాల క్రితమే కూల్చివేయమని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నూతన భవనం పూర్తి కాకపోవడంతో గత్యంతరం లేక శిథిల భవనంలోనే ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. గదులకు పగుళ్లు ఏర్పడడం, భవనం పైకప్పు పెచ్చులూడి విద్యార్థులపై పడడంతో భయాందోళనకు గురవుతున్నారు. వర్షాలకు పైకప్పు కురుస్తోంది. ప్రమాదకరంగా ఉన్న భవనంలో పాఠశాల కొనసాగుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు పాత భవనం కురుస్తుండడంతో ఉపాధ్యాయులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి విద్యా బోధన చేస్తున్నారు. సరిపడా తరగతి గదులు లేక పాఠశాల హెచ్ఎం గదిలో ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు స్పందించి నిధులు విడుదల చేసి పాఠశాల భవనం పనులను త్వరగా పూర్తి చేయించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.



చెరువుఅన్నారంలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం



హెచ్ఎం గదిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

పాఠశాల భవనం పూర్తి చేయాలి



పాఠశాల తరగతి గదుల్లో పై పెచ్చులు ఊడి మీద పడుతున్నాయి. దీంతో భయాందోళన మధ్య ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. విద్యార్థులంతా భయపడుతూ తరగతి గదుల్లో కూర్చొని విద్యనభ్యసిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది. అధికారులు స్పందించి అసంపూర్తి భవనాన్ని వెంటనే పూర్తి చేయాలి.

–బి.కల్యాణి, 5వ తరగతి విద్యార్థిని, చెరువుఅన్నారం పాఠశాల

నిధులు విడుదల చేయాలి



కాంట్రాక్టర్‌కు నిధులు విడుదల చేయకపోవడంతో పాఠశాల భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. నూతన భవనానికి మంజూరైన నిధుల్లో సగం నిధులు (కనీసం రూ.10 లక్షలు) మంజూరు చేసినా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్ సిద్ధంగా ఉన్నాడు. శిథిల భవనంలో విద్యార్థులు భయాందోళన మధ్య విద్యనభ్యసిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి నూతన భవనం పనులు పూర్తి చేయడంతోపాటు పాత భవనాన్ని కూల్చివేయాలి.

–జి. భీమయ్య, చెరువుఅన్నారం పాఠశాల హెచ్ఎం

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

కనగల్: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎస్ఐ పి.విష్ణుమూర్తి అన్నారు. మంగళవారం కనగల్ మోడల్ స్కూల్‌లో యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ వారంలో భాగంగా స్లోగన్ రైటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ థామసయ్య, రవీందర్‌రెడ్డి, భవాని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి

చిట్యాల: డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలని చిట్యాల ఎస్ఐ అఫ్రీన్ నసీహా అన్నారు. చిట్యాల జెడ్పీహెచ్ఎస్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ వాడకంతో మానసిక, శారీరక అనారోగ్య సమస్యలు వచ్చి ప్రాణహానికి దారి తీస్తుందన్నారు. డ్రగ్స్ వినియోగంతో సమాజంలో నేరాల తీవ్రత పెరుగుతుందని వివరించారు. డ్రగ్స్ వాడకంతో జరిగే నష్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని, డ్రగ్స్ వాడకందారుల, విక్రయదారుల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఆమె సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు గోగికార్ మాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకన్న, ఉపాధ్యాయులు చిలకరాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల: మాట్లాడుతున్న ఎస్ఐ అఫ్రీన్ నసీహా

దరఖాస్తుల ఆహ్వానం

కేతేపల్లి: ఓపెన్ టెన్త్‌లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కేతేపల్లి జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు, టాస్ కోఆర్డినేటర్ యానాల నర్సిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చదువు మధ్యలో మానేసివారు ఓపెన్ టెన్త్‌లో చేరి పదో తరగతి పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. అర్హులైన వారు ఆధార్, టీసీ, కుల ధృవీకరణ పత్రాల జిరాక్స్‌లు, 3 పాస్ ఫొటోలు జతచేసి జూలై 15లోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 929169027 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఓర్వలేకనే విమర్శలు

కేతేపల్లి: పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శలు చేస్తున్నారని టీపీసీసీ మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ.యూసుఫ్‌జానీ అన్నారు. మంగళవారం కేతేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే లింగయ్య కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చిట్యాల: పట్టణ ఇస్త్రీ, డ్రై క్లీనింగ్ షాపుల యూనియన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా అక్కెనపల్లి నాగయ్య, ప్రధానకార్యదర్శిగా ఐతరాజు యాదయ్య, గౌరవ సలహాదారులుగా పైళ్ల ఆశయ్య, గౌరవాధ్యక్షుడిగా చెరుకు పెద్దులు, ఉపాధ్యక్షులుగా పాలమాకుల అర్జున్, నలపరాజు శేఖర్, సహాయ కార్యదర్శులుగా అమరోజు రాములు, బండగోని వెంకన్న, కోశాధికారిగా ఐతరాజు సైదులు, కార్యవర్గ సభ్యులుగా దామనూరు వెంకన్న, ఐతరాజు సత్తయ్య, వెలిమినేటి అంజయ్య, గుండెగోని సత్తయ్యలు ఎన్నికయ్యారు.

ప్రిన్సిపాల్ పదవీ విరమణ

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కాలేజీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గంట్ల శ్రవణ్‌కుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ వడ్డే భూపాల్‌రెడ్డి, నడింపల్లి వెంకన్న, ౦కర్‌రావు, వెంకటేశ్వర్లు, శంబయ్య, అంజిబాబు వెంకటేష్ ఉన్నారు.

సంక్షేమ వసతి గృహాల తనిఖీ

నల్లగొండ: పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల హాస్టల్‌ను మంగళవారం ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ బి.శశికళ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె హాస్టల్ బాలికలతో మాట్లాడారు. పుస్తకాలు, దుస్తులు వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ వంట విధానాన్ని పరిశీలించారు. హాస్టల్ పిల్లలకు రుచికరంగా వండి పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు

వసతి గృహం తనిఖీ

తిప్పర్తి : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తిప్పర్తి తహసీల్దార్ పరుశురాం మంగళవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహ ఆవరణ ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేయాలని, ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.



తిప్పర్తి : వసతిగృహంలో రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ పరుశురాం

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కట్టంగూర్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ అధికారి ఎస్ రేవతి సూచించారు. మంగళవారం కట్టంగూర్ మండలంలోని చిన్నపురి గ్రామంలో గల మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలలో బాలల హక్కులపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలల హక్కులు, బాల్య వివాహాలు, పోక్సో చట్టంపై బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారదారాణి, పద్మావతి, ప్రాథమిక ఆస్పత్రి వైద్యాధికారి శ్వేత, అక్షిత, ఎన్‌జీఓ జాన్సీ, పాఠశాల హెచ్ఎం, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత



నియామక పత్రం అందుకుంటున్న దైద రవీందర్

నకిరేకల్ : టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నకిరేకల్‌కు చెందిన దైద రవీందర్ హైదరాబాద్‌లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం నియామక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, నాయకులు నేతకాని కృష్ణయ్య, గార్లపాటి చంద్రశేఖర్, యూసఫ్, బండారు ఆనంద్, వంటిపాక యాదగిరి, రాజశేఖర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులను తొలగించాలి

చిట్యాల: మున్సిపాలిటీలో విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన మద్యం బెల్టు షాపులను తొలగించేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మలిదశ ఉద్యకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కూనురు సంజయ్‌దాస్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చిట్యాల మున్సిపాలిటీలోని బెల్టు షాపుల్లో రాత్రింబవళ్లు మద్యం అమ్మకాలు చేపడుతున్నారని ఆరోపించారు. పాఠశాలలు, ఆలయాల సమీపాల్లో ఏర్పాటు చేసిన బెల్టుషాపులతో విద్యార్థులు, మహిళలు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వీరబాబుకు సన్మానం

రామగిరి(నల్లగొండ): న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన మాతంగి వీరబాబును తెలంగాణ లెక్చరర్స్ ఫోరం(టీఎల్ఎఫ్) నలగొండ జిల్లా అధ్యక్షుడు పెరిక మధు మంగళవారం సన్మానించారు. టీఎల్ఎఫ్ నాయకులు గిరిధర్, శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.

అసభ్య పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

రామగిరి(నల్లగొండ): సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెడుతూ మానసికంగా వేధిస్తున్న కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన కొప్పుల ప్రదీప్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు కొప్పుల సునంద–శ్రీనివాస్ రెడ్డి కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రామగిరి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొప్పుల ప్రదీప్ రెడ్డి, జలంధర్ రెడ్డి తమ కుటుంబంపై కేతేపల్లి రెడ్డి సంఘం వాట్సాప్ గ్రూపులో అసత్య పదజాలంతో పోస్టులు పెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి తమకు భూములకు సంబంధించిన పంచాయితీలు ఉండేవని. తప్పుడు రికార్డులు సృష్టించి భూమి లాక్కోవాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారని, ఒక అధికారిని తప్పుదోవ పట్టించి సస్పెన్షకు గురి చేశారని తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా



ప్లాస్టిక్ కవర్లు సీజ్ చేస్తున్న అధికారులు

మునుగోడు: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు వినియోగిస్తే జరిమానా తప్పదని మండల అభివృద్ధి అధికారి ఈ.విజయ భాస్కర్ హెచ్చరించారు. మంగళవారం ఎంపీఓ స్వరూపరాణి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డితో కలిసి మునుగోడులోని పలు దుకాణాలను ఆయన తనఖీ చేశారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేశారు. ప్లాస్టిక్ కవర్లు విక్రయించినా, వినియోగించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే రైతుల అభివృద్ధి

తిప్పర్తి : కాంగ్రెస్ పాలనలోనే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేయడంతో మంగళవారం తిప్పర్తి మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో రైతులతో కలిసి రైతు భరోసా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతు భరోసా నిధులు రైతులకు 9 వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం ఏకకాలంలో జమ చేసిందన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు

తిప్పర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు సంబరాలపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని రైతులు, నాయకులు కలిసి వీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పరుశురాం, ఎస్ఐ శంకర్, నాయకులు ముత్తినేని శ్యాంసుందర్, జాకటి మోష, కిన్నెర అంజి, నలపరాజు శ్రీనివాస్, బద్దం సైదులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

జెండా ఊపి వాహనాలను ప్రారంభించిన కలెక్టర్

నల్లగొండ: ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద వానాకాలం సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.9,000 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రైతు భరోసా సంబరాల్లో పాల్గొనేందుకు నల్లగొండ నుంచి బయలుదేరి వెళ్తున్న రైతుల వాహనాలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి కలెక్టరేట్ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. సుమారు 200 మంది రైతులు హైదరాబాద్‌లో జరిగే సదస్సుకు హాజరయ్యేందుకు వెళ్లినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, జిల్లా ఉద్యాన శాఖ డీడీ అనంత రెడ్డి, వ్యవసాయ అధికారులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వెలుగుపల్లిలో రైతు భరోసా సంబరాలు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ మండలం వెలుగుపల్లి గ్రామంలో రైతు భరోసా సంబరాలను ఘనంగా నిర్వహించారు. వెలుగుపల్లి రైతు వేదికలో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా రెవెన్యూ జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌తో పాటు పలువురు జిల్లా అధికారులు, రైతులు హాజరయ్యారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి అనంతరెడ్డి, వ్యవసాయ శాఖ ఏఓ, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వంగూరు లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జూలకంటి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బీరం కరుణాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నకిరేకల్ : చందుపట్ల రైతు వేదికలో సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండ మండలం వెలుగుపల్లి రైతు వేదిక వద్ద సంబరాల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

నకిరేకల్ : రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద కేవలం తొమ్మిది రోజుల్లో రూ.9000 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా మంగళవారం రైతు భరోసా సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చందుపట్ల రైతు వేదికలో కలెక్టర్ ఇలా త్రిపాఠి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్, నల్లగొండ ఆర్డీఓ యానాల అశోక్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీలు పుట్ట సరిత సత్యనారాయణ, ఇమడపాక లక్ష్మి వెంకన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నకిరేకల్ పట్టణంలో రైతు భరోసా సంబరాలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య, పన్నాల రాఘవ రెడ్డి, లింగాల వెంకన్న, బ్రహ్మదేవర రమేష్, కందాల భిక్షంరెడ్డి, యాసారపు వెంకన్న, వేమవరపు నర్సింహులు, కొండ వెంకన్నగౌడ్, చౌగోని సైదులు, బండపల్లి శ్రీనివాస్, గోలి పద్మ, గునగంటి రాజు, బానోతు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



తిప్పర్తి : సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు



కేతేపల్లి : సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న మార్కెట్ చైర్‌పర్సన్ గుత్త మంజుల, అధికారులు

మర్రిగూడలో సంబరాలు

మర్రిగూడ : రాష్ట్ర ప్రభుత్వం 9 రోజుల్లో రూ.9వేల కోట్లను రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో జమ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం మర్రిగూడ మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద రైతు భరోసా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు వేదికలో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులు, అధికారులు వీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్, ఎంపీడీఓ జి.చినమునయ్య, ఏఓ సాహస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ పి.యాదయ్య, శివన్నగూడ ఎఫ్ఎస్‌సీఎస్ ఛైర్మన్ నరసింహ, ఏఈఓలు విజయ్‌కుమార్, సుజాత, శ్రీలత, రాధిక, అరుణ, నాగస్వాతి, ఆర్ఐ జహీరొద్దీన్, పీఏసీఎస్ సీఈఓ శ్రీను, ఎఫ్ఎస్‌సీఎస్ సీఈఓ మధుకర్, డైరెక్టర్ లింగయ్య, మారెమ్మ పాల్గొన్నారు.

కేతేపల్లి: రైతు భరోసా సంబరాల్లో భాగంగా మంగళవారం కేతేపల్లి, ఇప్పలగూడెం, భీమారం గ్రామాల్లో గల రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు వీక్షించారు. కార్యక్రమంలో నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుత్త మంజుల మాధవరెడ్డి, డైరెక్టర్లు ఎస్‌కే.లతీఫ్, బయ్య ముత్తయ్య, తహసీల్దారు ఎంఏ సత్తార్, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఏఓ బి.పురుషోత్తం, ఏఈఓలు బాలరాజు, ఉమేష్, నాగరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ

నార్కట్‌పల్లి : మండలంలోని ఔరవాణి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామ పోలీసు అధికారి పందిరి శ్రీనివాస్ మంగళవారం సొంత ఖర్చులతో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడి హరికృష్ణ, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ధర్మయ్య, రమాదేవి, శ్రీను, భవాని, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మంగళవారం హాస్టల్ వెల్ఫేర్ అధికారి వరికుప్పల రాజు నోట్‌బుక్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వసతి గృహంలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.



నార్కట్‌పల్లి : నోట్ పుస్తకాలు అందజేస్తున్న గ్రామ పోలీసు అధికారి పందిరి శ్రీనివాస్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

కనగల్: అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి అన్నారు. మంగళవారం కనగల్ లో నిర్వహించిన సీపీఐ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో వచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి గంట సత్యనారాయణ, సహాయ కార్యదర్శి చిలకరాజు రాములు, జోగు సురేందర్, గట్టిగుండ్ల నరసింహ, వెంకటేశ్వర్లు, సింగం నరసింహ, నాగమ్మ, యాదయ్య పాల్గొన్నారు.

నకిరేకల్ మీదుగా హైదరాబాద్‌కు ఎలక్ట్రిక్ బస్సులు

నకిరేకల్: సూర్యాపేట ఆర్టీసీ డిపోకు చెందిన ఏడు ఎలక్ట్రిక్ డీలక్స్ బస్సులను బుధవారం నుంచి నకిరేకల్ మీదుగా హైదరాబాద్‌కు నడిపించనున్నారు. హైదరాబాద్‌కు వెళ్లే బస్సులకు నకిరేకల్, కట్టంగూర్, నార్కట్‌పల్లి, చిట్యాల, చౌటుప్పల్‌లో స్టాప్ ఉన్నాయని సూర్యాపేట డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. వీటితో పాటు సూర్యాపేట నుంచి దేవరకొండ వరకు వయా తాటికల్, నల్లగొండ మీదుగా నాలుగు ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్‌లు నడిపిస్తున్నామని తెలిపారు.

ఆర్థిక చేయూత

మర్రిగూడ: మండలంలోని మేటిచందాపురం ఆవాసం ఇందుర్తి గ్రామానికి చెందిన ఊరుపక్క మల్లయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చెరుకు లింగంగౌడ్ మంగళవారం ఆస్పత్రికి వెళ్లి మల్లయ్యను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు.